# బోన్‌సాయ్

'టాట్, వీల్లేదు. ఆ పిల్లను కోడలు చేసుకోటమే! కుదరదు. అసలే నా కొడుకు మేథకుడు. అది వ్హాడి చెవులు పట్టి ఆడిస్తుంది' అన్న గట్టి నిర్ధారణ కొచ్చేసింది అనసూయ. సహజమే కదా! మనమాట ఎదుటివాడు వినకపోతే మనకు నచ్చదు. అందుకే మనమాట వినని, విన్పించుకోని మనుషులను దూరంగా ఉంచుతుంటాం. సాధారణ విషయాల్లోనే మనుషుల మనస్తత్వం ఇలావుంటే, ఓ అత్త కోడల్ని తెచ్చుకోటం గూర్చి ఎంత ఆలోచించాల్సి వుంటుంది. ఆలోచించాకే ఆమె ఆ నిర్ధారణకొచ్చింది.

మీరు ఆశ్చర్యపోవచ్చు. "ఆ పిల్ల నీరజ ఆమె మేనకోడలే కదా! పైగా నిన్నమొన్నటి దాకా తమ్ముడు సదానందానికి చెబుతూనే ఉంది కదా - నీరజను నా కొడుక్కు చేసుకుంటానురా! నువ్వేం పై సంబంధాలు చూడాల్సిన అవసరం లేదు. పైగా అమ్మ పోయేటప్పుడు చిట్టిబాబుకు నీరజను చేసుకోమని చెప్పి పోయింది. అలాగేనని అమ్మకు మాటకూడా ఇచ్చాను. నువ్వు మాత్రం అమ్మ మాట ఎలా కాదంటావు?- అంది కదా" అని.

నిజానికి ఇందులో అనసూయ తప్పేమీ లేదు.మన మిత్రుడు సదానందం కూతురికి ఏ ఇంజనీరింగో,మెడిసినో చదివించి ఊరుకోవచ్చుకదా! ఆ పిల్ల లా చదువుతానంటే కాదనకుండా తలూపాడు.

తమ్ముడు, "అదిఇంజనీరింగ్ గట్రా చేయదంట అక్కా! లా చదువుతా, లేపోతే ఇంట్లో కూర్చుంటా నంటది. ఇంట్లో గోళ్ళు గిల్లు కుంటూ, టివీలు చూస్తూ గోళ్ళూ, కళ్ళూ ఖరాబు చేసుకోటమెందుకని దాన్ని లా కోర్సులో చేర్పించినా నక్కా!" అని అన్నప్పుడు ఆమె రాబోయే పరిణామాల నూహించలేదు కానీ, ఎందుకో మనసు కీడు శంకించగా, "ఎందుకురా, ఇప్పుడు దానికి చదువు? రెండేళ్ళాగితే పెళ్ళి చేసెయ్యొచ్చు. చిట్టిబాబుకి అప్పటికి హైదరాబాదుకు బదిలీఅవుతుంది" అంది అనసూయ.

"నీదంతా ఉట్టి చాదస్తం, అక్కా! అటు పెళ్ళీకాక, ఇటు చదువూలేక ఆడపిల్లల బుర్రలు చెడిపోవంటే?చదూకోనీ, రేపెందుకైనా పనికొస్తాది" అన్నాడు సదానందం.

"అంతగా దానికి పొద్దుపోకపోతే, దాన్ని నా దగ్గరకు పంపరాదూ? వంటా - వార్పూ నేర్పుతాను."

"ఆ మాత్రం నా పెళ్ళాం నేర్పదుటే! ఆడపిల్లన్నాక, వంటావార్పూ రాకుండా ఉంటదా?"

అనసూయమ్మ అప్పటికేం మాట్లాడలేక పోయింది. చిట్టిబాబు బ్యాంకిలో పని చేస్తున్నాడు. కొత్త పోస్టింగ్! మహబూబ్‌నగర్ జిల్లా వనపర్తిలో పోస్టింగిచ్చారు. కొంతకాలం రూరల్ ఏరియాలో పని చెయ్యాలట!

ఆ మధ్య సంక్రాంతికి వారం రోజులు సెలవు పెట్టి వచ్చాడు చిట్టిబాబు. బావ వచ్చాడని నీరజకూడ వాళ్ళింటికి వెళ్ళింది చూట్టానికి, మధ్యాహ్నం. "లాలో చేరావంట కదా!" అనడిగాడు చిట్టిబాబు, తల్లి పెట్టిన వేడివేడి గారెలు తినబోతూ.

పలకరించటమనే ఘనకార్యం దిగ్విజయంగా పూర్తిచేసి ఇంక గారెల పనిబట్ట ప్రారంభించాడు. అనసూయ మేనకోడలికిక్కాడ ఓ ప్లేటులో గారెలు పెట్టి ఇచ్చింది.

"నా కొద్దు, అత్తా! నాకు గారెలు సయించవు" అంది నీరజ.

"అదేం చోద్యమే, నా తల్లీ! వాడికి గారెలంటే ఇష్టం. నువ్వూ ఇష్టం చేసుకో" అంది అనసూయ.

"పాత కాలపు వంటలు! అయినా బావకి గారెలిష్టమయితే, నేనెందుకు ఇష్టం చేసుకోవాలి?"

"కాబోయే మొగుడి రుచులు, అభిరుచుల బట్టి నడవొద్దూ, ఆడదన్నాక?"

"అవన్నీ పాత మాటల్లే, అత్తా! ఎవరి అభిరుచులు వాళ్ళవి. అయినా కలసి బతకటం సాధ్యమే. ఏమంటావు, బావా?" అనడిగింది నీరజ చిట్టిబాబుని.

'అవును, అవును' అన్నట్టు తలూపాడు చిట్టిబాబు, తెరచిన నోట్లో గారె కుక్కు కుంటూ, మాటల్తోఅనవసరపు వ్యాయామం నోటికి కల్పించటం ఇష్టంలేక.

మేనకోడలి మాటలకు కొడుకు గంగిరెద్దులా తలూపటంలో తిక్కరేగి పోయింది అనసూయకు.

"అవునే, ఎప్పటి నుండో చూస్తున్నాను! ఏవిటా డ్రస్సులు! ఏంచక్కా చీరె కట్టుకుంటే ఎంత బావుంటుంది! ఏమంటావురా, అబ్బాయ్!" అంది.

అబ్బాయికి తీరికలేదు. 'అవును, నిజమే' అన్నట్టు తలూపాడు. అప్పుడు అనసూయకు ఆశ్వాసన లభించింది, తన కొడుకు తన్ను మీరి పోలేదని.

నీరజ ముఖం చిట్లించింది. "ఏవిటలా డూ డూ బసవన్నలా తలూపటం, మాట్లాడ లేవూ?" అంది.

నోటి నిండా అమ్మపెట్టిన గారె ఉండటంతో 'ఆగమ'ని సైగ చేసి, ఆ కార్యం పూర్తయాక, "అవును కదా! నువ్వు చీరెలో కూడ చూడ ముచ్చటగా ఉంటావని అమ్మ అభిప్రాయం" అన్నాడతను.

తన డ్రస్సును కాదన్నందుకు అమ్మడు సంతసించింది; కొడుకు తన్ను సమర్థించినట్లు కన్పించినందుకుఅమ్మా సంతోషపడి పోయింది; ఇద్దర్నీ సంతోషపెట్టినందుకు అబ్బాయీ సంతసించాడు. అయితే, జీవితంలో ఇలాంటి సందర్భాలు అరుదని అతనికి తెలియదు.

అనసూయ ఆ తర్వాత ఆలోచనలో పడి పోయింది.'పెళ్ళి కాకుండానే ఎంతమాట బడితే అంత మాట అనేస్తున్నది. దీని నోరు కట్టడి చేయాలి' అనుకుంది. 'ఇది వరకు ఇంత ఇదిగా లేదు. లా లో చేరాక దానికి తెలివి తేటలు పెరిగాయి. ఇంక ఆ కోర్సు పూర్తి చేసిందంటే దాన్ని పట్ట పగ్గాలుండవు' అనీ నిర్ధారణ కొచ్చింది.

అయితే, ఓ రోజు పేపర్లో ఓ వ్యాసం చదివాక ఆమెకు ఒంట్లో వణుకు పుట్టింది. 'లా చదువుకున్నాం కదా, మనకి తెలియనిదేం లేదు' అనుకుంటూ, పురుషాధిక్యాన్ని ప్రశ్నించే దిశగా ఆడ లాయర్లు ఒక అసోషియేషన్ ప్రారంభించారట. ఆడది మగవాడికి బానిస కాదు. భార్యా, భర్తలంటే సంసార రథానికి జోడు గుర్రాల్లాంటి వాళ్ళు. కనుక, స్త్రీకూడ ఆత్మనిర్భరత సంపాదించుకుని, తన కాళ్ళపై తను నిలబడి భర్తకు దీటుగా ఉండాలి. భర్తకదా అని పురుషాధిక్యాన్ని సహించకూడదు. చట్టం స్త్రీలకు అండగా ఉంది'– అని ఆ అసోషియేషన్ ఉద్బోధిస్తోంది. కనుక, ఆంధ్ర ప్రదేశ్‌లో లాచదివిన అమ్మాయిలను కొడుకులకు చేసుకోటానికి తల్లిదండ్రులు భయపడుతున్నారట! భాబాసం (భార్యా బాధిత సంఘం) ఈ ఆడ లాయర్ల సంఘంలోని సభ్యుల్లో సగం మంది భర్తలకు విడాకులిచ్చిన వాళ్ళే అని దుయ్యబట్టిందనీ ఆ పత్రిక రాసింది. "పెళ్ళీ మహదానందకరమే, అజ్ఞానమూ మహదానందకరమే. కనుక పెళ్ళిచేసుకోటం అజ్ఞానమే" అని వాళ్ళన్నారని కూడా రాసింది. ఆ లాజిక్కేమిటో అనసూయకు సరిగా అర్థం కాలేదు.

అయితే, ఆ వ్యాసం చదివాకే అనసూయకు కూడ కొడుకు మేథకుడు కనుక ఆ పిల్ల వాడి చెవులు పట్టి ఆడించే అవకాశం ఉంది అన్న ఇదివరకటి ఆలోచన బలపడింది. ఇంక జాప్యం చెయ్యలేదు అనసూయమ్మ. వెంటనే తమ్ముణ్ణి పిలిచి, నిర్మొహమాటంగా

చెప్పేసింది. "ఒరే, సదా! నువ్వు నీ కూతురి లాయరు చదువును ఆపెయ్యకపోతే నేను దాన్ని నా కొడుక్కు చేసుకోను. దాన్ని ఆ చదువు మాన్పించెయ్యి. ఆ తర్వాత అక్క ఇలా చేసిందని నామ్మీద నిష్ఠూరం వేస్తే బాగుండదు" అని గట్టిగానే చెప్పేసింది.

"అదేం, అది లాయరు కోర్సు చేసినంత మాత్రాన నీ కొచ్చిన నష్టమేంటి?" అనడిగాడు తమ్ముడు.

"అబ్బాయి, దీన్లో వాదనలకు తావులేదు. అదంతే. అంత్య నిష్ఠూరం కంటె ఆది నిష్ఠూరం మేలు" అంది.

పాపం, సదానందం ఎప్పుడూ అక్క మాటను కాదంది లేదు. సరయిన కారణం లేకుండా అక్క అట్లా చెప్పదని అతని విశ్వాసం.

లాయరు చదువు మానేసి వేరే చదువు చదువుకోవల్సిందని కూతురికి చెప్పి చూశాడు సదానందం. కానీ ప్రయోజనం లేక పోయింది. పైగా, "మీ అక్క చెప్తే నేను చదువు మానెయ్యాలా? ఛస్తే మానను" అని కుండ బద్దలు కొట్టినట్లు చెప్పేసింది.

పాపం, సదానందంకు ఎటూ పాలుపోలేదు. అయిన సంబంధం. పిల్లవాడు మంచివాడు. మంచిఉద్యోగం. పైగా పిల్లకు పిల్లవాడంటే ఇష్టం. వాడికీ గారెల తర్వాత నీరజంటేనే ఇష్టం. అందుకని మిత్రుడు పరమాత్ముడి దగ్గరకు వెళ్ళి, విషయం వివరించి, "నీకు రెండు కుటుంబాలు తెల్సినవే కనుక, వాడికి నచ్చ చెప్తావో, మా అక్కకు నచ్చ చెప్తావో నీ ఇష్టం. ఈ సంబంధం పొసగించేట్టు మాత్రం చూడు" అని అర్థించాడు.

అలా మిత్రుడంతగా ప్రాధేయపడ్డాక కాదనటం పరమాత్ముడి వల్ల కాలేదు. అనసూయమ్మకు నచ్చచెప్పటం బ్రహ్మ తరం కాదని అతనికి తెల్సు. అయినా ప్రయత్నించి చూశాడు.

"చూడురా, పరమాత్ముడూ! నువ్వూ నా తమ్ముడి లాంటి వాడివే. 'ఆడపెత్తనం... దొరతనం' పనికి రాదన్నారా లేదా? అదసలే చిచింద్రీ. ఏదో మా చిన్నమ్మ పోయేప్పుడు మాట తీసుకుంది కదా అని నేను కాదంటం లేదు. చూస్తూ చూస్తూ బట్ట ముళ్ళ కంప మీద ఆరేసుకోలేం కదా! అది తప్పనప్పుడు, తగిన జాగ్రత్తలు తీసుకోవాలా వద్దా? ఈ మాటలన్నీ సదానందంతో అంటే వాడు చిన్నబుచ్చు కుంటాడు. వాడి ఏడుపు మొహం నేను చూడ లేను."

"ఆడపెత్తనం వల్ల చెడిపోయేదేముందక్కా! బావగారు ఇంటి విషయాలేవీ పట్టించుకోక పోయినా నువ్వు నిర్వహించుక రావటంలా?" అన్నాడు పరమాత్ముడు.

"నువ్వేమయినా అనుకో గానీ మీ బావగారికి తెలియకుండా నేనే పనీ చెయ్యను. పబ్లిక్ ప్రాసిక్యూటర్ కదా మీ బావగారు.ఆయనే ఈ సందేహం వెలిబుచ్చింది. ఆయన ఈ సంబంధం అసలు వద్దనేశారు. నేనే చిన్నమ్మ కొడుకు కూతురు కదా అని పాకులాడుతున్నాను. నువ్వు దాన్ని లా మానిపించేటట్టు చూడు. చచ్చి నీ కడుపున పుడతాను" అంది అనసూయ.

అనసూయ, సదానందం అక్కచెల్లెళ్ళ బిడ్డలయినా సొంత అక్కా తమ్ముళ్ళలాగానే ఉంటారు. అయితే, తనకు నిజంగానే నష్టం కలుగుతుందనుకున్న సందర్భంలో మొహమాటాలకు పోయే మనిషి కాదు అనసూయ. తమ్ముడికి ఒక్కతే కూతురు, బోల్డంత ఆస్తి. ఆ ఆస్తంతా రేపు నీరజను కట్టుకున్నవాడికే దక్కుతుంది కదా! అందుకే అనసూయ తెలివిగా తమ్ముడిని చిన్నమ్మకు తనిచ్చిన మాటంటూ కట్టిపడేసింది. ఆపైన నీరజ చిట్టి బాబును ఇష్టపడటం కూడా ఆమెకు కలసి వచ్చింది.

అసలు ఈ సంబంధం ప్రస్తావన వచ్చినప్పుడే మరదలు రుక్మిణి, "దగ్గరి సంబంధాలు మంచివి కావంటారు, వదినా! పుట్టే పిల్లలు అవకరంతో పుడతారట!" అంది.

"చాల్లేవే, చెప్పొచ్చావు! సదా నాకు స్వంత తమ్ముడి కంటే ఎక్కువే అయినా చిన్నమ్మ కొడుకే కదా! నేనవన్నీ విచారించకుండా ఈ మాటంటానా? పైగా పిల్లలు కూడా ఇష్ట పడుతున్నారు" అంది అనసూయమ్మ.

దాంతో రుక్మిణి నిరుత్తరురాలయి పోయింది. తన కూతురు బుచ్చిబాబును ఇష్ట పడుతున్న మాట నిజమే మరి!అనసూయమ్మ దగ్గరినుండి ఖాళీ చేతులతో తిరిగి వచ్చిన పరమాత్ముడికి ఇంక ఒక్కటే మార్గం కనిపించింది. చిట్టిబాబును, నీరజను తన ఇంట్లో సమావేశపరిస్తే వాళ్ళే తేల్చుకుంటారన్న నిశ్చయానికి వచ్చినవాడై, చిట్టిబాబు ఆదివారం ఇంటికొస్తాడు కనుక అతన్ని సాయంత్రం ఐదు గంటలకు తన ఇంటికి రమ్మని ఆహ్వానించాడు. అలాగే నీరజనూ రమ్మని ఫోను చేశాడు.

నీరజ టంచనుగా ఐదు గంటలకల్లా పరమాత్ముడి ఇంటికి వచ్చింది. "ఏవమ్మా! చిట్టిబాబు నిన్ను పెళ్ళిచేసుకోటానికి భయపడుతున్నాడట!" అని విషయాన్ని కదిపాడతను.

"ఈ మగాళ్ళకు స్త్రీలు సెల్ఫ రిలయెంట్‌గా, స్వతంత్రంగా ఉండటం నచ్చదు. అదీ పెళ్ళాం లాయరైతేతన్ను ఎక్కడ ధిక్కరిస్తుందో నని వాళ్ళ భయం. వాళ్ళకు చెప్పినట్టల్లా ఆడే బొమ్మలు కావాలికానీ, అర్థాంగులుకాదు" అంది కోపంగా నీరజ.

"అంటే నీకూ అతడంటే ఇష్టంలేదన్నమాట!" అన్నాడు.

"అలా అని నీకెప్పుడు చెప్పాను, అంకుల్!" అంది నీరజ.

"మరిప్పుడు నీ మాటల అర్థం అదే కదా?"

"అది అందర్నీ గురించి చెప్పిన సాధారణమైన మాట! నువ్వే మనుకోక పోతే నీకో మాట చెప్పేదా, అంకుల్!" అంది నీరజ.

"అయ్యో, చెప్పు. దానికి అభ్యంతరమేం?" అన్నాడు పరమాత్ముడు.

"మాన్ ఈజ్ బై నేచర్ ఎ పర్వర్టెడ్ ఏనిమల్! ఉమన్ నీడ్స్ టు కంట్రోల్ హిం."

'ఆ ప్రయత్నంలో బోన్‌సాయ్ మొక్కలా అతన్ని ఎదగనివ్వకుండా చేస్తావు, అతని స్వేచ్ఛని హరింప చూస్తావు' అనుకున్నాడు పరమాత్ముడు.

అంతలోనే చిట్టిబాబు రావటం చూసి, "ఏం బావా, నన్ను పెళ్ళి చేసుకోనంటున్నావట!" అని సూటిగా అతన్ని ప్రశ్నించింది నీరజ.

చిట్టిబాబు మొహమాటస్థుడు. ఎదుటి వ్యక్తికి అప్రియమైంది చెప్పలేడు. అదో రకం బలహీనత. అలాంటి వాళ్ళు జీవితంలో కొంత కోల్పోక తప్పదు.

"అహ, అది కాదు.... నువ్వు లాయరవటం అమ్మ కిష్టంలేదు...." అని నసిగాడు.

"నీకూ ఇష్టంలేదా?"

"అని కాదూ, అమ్మ అభిప్రాయం గౌరవించటం మంచిది కదా!"

"అది సరే, మగడా, అత్తయ్య అభిప్రాయం గౌరవించటంకోసం నా ఆశయాన్ని తోసి పారేస్తావా? మనకు బుద్ధి ఇచ్చింది మన ఆలోచనలు మనం చేసుకోటానికి గానీ, ఇతర్ల ఆలోచనలు మనవి చేసుకోటానికి కాదు!"

"ఇతర్లెవరూ, మా అమ్మేగా?"

"అమ్మయినా, బాబయినా మనమూ మనుషులమే. మన బుద్ధి ఉపయోగించక పోతే తుప్పు పట్టిపోతుంది. ఇప్పటికే తుప్పు వాసన వస్తోంది..."

ఆ మాటలో కోపం వచ్చింది బుచ్చిబాబుకు. "నేను నిన్ను చేసుకోను" అన్నాడు.

"నేను చేసుకుంటాను. ఇన్నాళ్ళూ ప్రేమించుకుని, సినిమాలూ, షికార్లూ తిరిగాక పెళ్ళి చేసుకోనంటే ఊరుకుంటాననుకుంటున్నావా? ఇప్పుడొచ్చి అమ్మ ఒప్పుకోటంలేదని చెప్తావా, అమ్మ కూచి! నీ కసలు వ్యక్తిత్వంలేదు. వెన్నెముక లేని మనుషులంటే నాకు

---

మూడోమనిషి

మంట!...” అంటూ ఓ పావుగంట ఉపన్యాస మిచ్చి, “ఇదుగో, ఇక్కడ సంతకం పెట్టు” అంది నీరజ.

డంగైపోయిన చిట్టిబాబు, “ఏమిటది?” అనడిగాడు.

“సివిల్ మారేజీకి అప్లికేషను ఫారం.ఎవరి ప్రమేయం లేకుండానే మన పెళ్ళయి పోతుంది నెల రోజుల్లో. భయపడక. అత్తను నేను ఒప్పిస్తాను గానీ ముందు నువ్వు సంతకం పెట్టు.”

మానవుడు కిక్కురుమనకుండా సంతకం పెట్టి వెళ్ళిపోయాడు. అతను మళ్ళా జీవితంలో నోరు తెరిచే ప్రశ్నే లేదనిపించింది పరమాత్ముడికి.

“వ్యక్తిత్వం లేదని అతన్ని తిడుతూనే, అతన్ని పెళ్ళి చేసుకోవాలన్న వెంపరలాట నీకెందుకమ్మాయి?” అని అడిగాడు.

“ఇంత చిన్న విషయం కూడా విడమర్చి చెప్పాలా, అంకుల్! చెప్పిన మాట వినే మొగుడుంటే ఎంత వెసులుబాటు!” అని చిరునవ్వు చిందించింది.

“వెన్నెముక లేని మనుషులంటే నీకు మంటన్నావు....!”

ఆమె నవ్వేసింది, కానీ జవాబు చెప్పలేదు. కానీ, ఆ నవ్వులో ఆమె చెప్పదల్చుకుని చెప్పని మాట పరమాత్ముడికి అవగతమయింది. “అసలు మగాళ్ళకు వెన్నెముక లెందుకూ? అలా ఉన్నవాడు ఎవడైనా ఉంటే శస్త్ర చికిత్స చేయించి తీసేయించితే మంచిది. ప్రపంచ శాంతి కది ఎంతో దోహద పడుతుంది” అన్నది ఆమె ఆలోచన.

‘అత్తా కోడళ్ళ ప్రయత్న మొక్కటే. అతను పెరిగితే ఎక్కడ తమ గుప్పిటనుండి జారి పోతాడోనని ఇద్దరి భయం. అందుకే జారిపోకుండా గుప్పెడు మూసే ప్రయత్నం చేస్తున్నారు. ఆ బోన్‌సాయ్ మొక్క పెరిగేనా?’ అనుకున్నాడు పరమాత్ముడు.

**ఈ వారం** (రాజకీయ సామాజికార్థిక వార పత్రిక), మార్చి 28, ఏప్రిల్ 3, 2010.

(23-01-2002 న ‘కలం-కంఠం’ ప్రోగ్రాంలో మరో పేరుతో ఆకాశవాణిలో ప్రసారితం.)